# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 20 బుధవారం2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 117

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను సహించం

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోన్న సందర్భంగా ప్రభుత్వం-ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తోంది.

- కిరాయి మూకలతో చెరేగితే చండాడుతాం
- దుర్బుద్ది పనులను మార్చుకోకుంటే జైలుకు తరలిస్తాం
- కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి ప్రజల్లోకి రావాలి
- తెలంగాణను అప్పులతో ముంచారు
- తాగుబోతుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనుడు

మహిళల అండతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు వారి అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం వరంగల్‌ను ప్రముఖ నగరంగా తీర్చిదిద్దుతాం ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం వరంగల్ వేదికగా విజయోత్సవ సభలో సిఎం రేవంత్

2లో

## కాంగ్రెస్ అసమర్థ పాలనతో నిత్యం ఆత్మహత్యలు

- కొడంగల్ పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా..?
- లగచర్ల.. చైనా సరిహద్దుల్లోని కల్లోలిత ప్రాంతమా..?
- అర్థరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండ
- మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా?
- వాళ్ళని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది..?
- వాస్తవాలను తొక్కిపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి. లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి.. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి అని కేటీఆర్ డిమాండ్

2లో



2లో

## నింగిలోకి దూసుకుపోయిన జీశాట్-20

నింగిలోకి మోసుకుపోయిన ఫాల్కన్ 9 రాకెట్

విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో



2లో

## రాత్రివేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు..

తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి

రెండురోజులుగా ఉష్ణోగ్రతలో మార్పులు

డిసెంబర్-జనవరి నాటికి తీవ్రమయ్యే అవకాశం

## మహారాష్ట్రలో నేడే పోలింగ్



2లో

288 స్థానాలకు పోటాపోటీ

అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

వర్లి నియోజకవర్గంలో ఆసక్తికర పోటీ

## ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారు

- అన్నిరంగాల్లో విఫలం అయ్యిందని ప్రజలు అంటున్నారు
- హామీల చర్చపై రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా
- నీతో మోడీ ఎందుకు..మేము వస్తాం...ఎక్కడో చెప్పండి
- లగచర్ల ఘటనతో రాష్ట్ర రైతుల్లో తీవ్ర ఆందోళన
- ఏ క్షణాన మా భూములు పోతాయో అని భయం
- మీడియా సమావేశంలో బిజెపి ఎంపి ఈటెల రాజేందర్



2లో

## మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

- సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం
- లక్ష్యాధికారులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం
- వరంగల్ వేదికగా మహిళలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరాలు

వరంగల్: అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. హనుమకొండలో ప్రజా పాలన విజయోత్సవ సభలో భట్టి మాట్లాడారు. వచ్చే పదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల మేర వడ్డీ లేని రుణాలిస్తాం. వారిని లక్షాధికారులను చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. మహిళలను

పారిశ్రామికవేత్తలుగా మార్చే కార్యక్రమాలను చేపడుతున్నాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం వారికి కల్పిస్తున్నాం అని భట్టి తెలిపారు. మహిళలకు డిప్యూటీ సీఎం భట్టి




విక్రమార్క గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తామని ప్రకటించారు. మహిళలను లక్ష్యాధికారులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం మహిళలకు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోన్న సందర్భంగా మంగళవారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ తొలి సభ నిర్వహించారు. ఈ సభకు హాజరై డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని దుయ్యబట్టిన భట్టి.. రాష్ట్రంలో మేం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలతో మహిళా సాధికారతకు కృషి చేశామని గుర్తు చేశారు. మహిళల కోసం మా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని..రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం కోసం ఎన్ని వేల కోట్లు అయినా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయం చెప్పేందుకే ఇక్కడ సభ పెట్టామని తెలిపారు. వరంగల్ పట్టణాభివృద్ధి కోసం దాదాపు రూ.6 వేల కోట్ల నిధులు మంజూరు చేశామని.. వరంగల్?ను మహా నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్నీ వాగ్దానాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని.. అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైకోర్టు షాక్

- రెగ్యులరైజ్ జివో 16 కొట్టివేత
- క్రమబద్ధీకరణ రాజ్యాంగ విరుద్ధమని వెల్లడి
- రెగ్యులరైజేషన్‌కు వ్యతిరేకంగా కోర్టుకు ఎక్కిన నిరుద్యుగులు

హైదరాబాద్: కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైకోర్టు షాకిచ్చింది. వారి రెగ్యులరైజేషన్ చెల్లదని తీర్పునిచ్చింది. రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు షాకిస్తూ...సెక్షన్ 10ఏ ప్రకారం తీసుకొచ్చిన జీవో 16ను తెలంగాణ హైకోర్టు మంగళవారం నాడు కొట్టివేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం అని హైకోర్టు స్పష్టం చేసింది. జీవో 16 ద్వారా గత బిఆర్ఎస్ ప్రభుత్వం వేలాది మందిని రెగ్యులరైజ్ చేసింది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖల్లోనే ఎక్కువ మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. తాజాగా హైకోర్టు సంచలన తీర్పుతో రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల భవితవ్యం మళ్లీ ఆందోళనలో పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేసిన ఉద్యోగులను తిరిగి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగించాల్సి ఉంటుందని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని పిటిషనర్లు తెలిపారు. అయితే దీనిపై హైకోర్టు నుంచి తమకు ఆర్డర్ కాపీ వస్తే స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సెక్షన్ 10ఏ ప్రకారం జీవో 16ను కెసిఆర్ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. విచారణ చేపట్టిన హైకోర్టు జీవోను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు(ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్యశాఖలోని 837 మంది వైద్య సహాయకులు,

179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులు ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా సగం జీతానికే సేవలు అందిస్తున్నట్లుగుర్తించిన గత ప్రభుత్వం వారి సేవలను గుర్తించి జివో 16 ద్వారా రెగ్యులరైజ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవల్ని గుర్తించి, వారి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి సెక్షన్ 10ఏ ప్రకారం జీవో 16 తీసుకొచ్చింది. దీని ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం పర్మినెంట్ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది.



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో నిత్యం ఆత్మహత్యలు

సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటి..? కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా..? లేక లగచర్ల.. చైనా సరిహద్దుల్లో ఉన్న కల్లోలిత ప్రాంతమా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లకు వెళ్తున్న మహిళా సంఘాల నేతలపై పోలీసులు దౌర్జన్యం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ప్రజా సంఘాలకు చెందిన మహిళా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.లగచర్లలో అర్ధరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదు.. పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా..? అని కేటీఆర్ మండిపడ్డారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది..? వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తోంది..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. కొడంగల్‌కు వెళ్లే అన్ని దారుల్లో పోలీసుల పహారా ఏర్పాటుచేశారని కేటీఆర్ తెలిపారు.

మీరెంత దాచే ప్రయత్నం చేసినా నిజం దాగదు..



ఇప్పటికే లగచర్లలో కాంగ్రెస్ సర్కారు కిరాతకం ఢిల్లీకి చేరింది. దేశ రాజధానిలో మీ అరాచకపర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతోంది. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను అడ్డుకోవడం అంటేనే.. కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి. లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి.. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలన కారణంగా ఆర్థికంగా చితికిపోయి రైతులు, ఆటోడ్రైవర్లతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిత్యం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా కవితాత్మంగా, తీవ్రంగా స్పందించారు. రోజుకో చావుతో తెలంగాణ తెల్లారుతోందని, కాంగ్రెసోడి కుట్రలకు బలైపోతున్నదని మండిపడ్డారు. రాజ్యహింసతో రాష్ట్రం నిత్యం తల్లడిల్లుతోందని, గాయాలతో గోడుగోడునా విలపిస్తోందని విమర్శించారు. రైతు రారాజుగా బ్రతికిన తెలంగాణలో అన్నదాతల ఆత్మహత్యలు నిత్యకృత్యమాయెనని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధికి చిరునామాగా

మారిన రాష్ట్రంలో జీవనోపాధి కరువై బడుగులు బలిపీఠం ఎక్కవట్టెనని ఆయన వాపోయారు. ఇది ఎవడు చేసిన పాపమని, ముమ్మాటికీ మార్పు తీసుకొచ్చిన శాపమేనని పేర్కొన్నారు. తన పోస్టుకు ఓ రైతు, ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యలకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్‌లను జతచేశారు.

# అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను సహించం

వరంగల్: తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేలా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తే జైల్లో పెడతాం అని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుట్రలు కుతంత్రాలతో అభివృద్ధిని అడ్డుకోలేరని అన్నారు. పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న సొమ్ముతో కిరాయిమనుషులతో అడ్డుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేయలేని పనులు తాము చేస్తుంటే పనులు చేస్తుంటే కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దుర్బుద్ధితో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ అనే మొక్కను తెలంగాణ గడ్డపై మళ్ళీ మొలవ నివ్వనని శపథం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెచ్చిన బెల్ట్ షాపులు ఊరురా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో తాగుబోతుల సంఘానికి ఏకైక అధ్యక్షుడు కేసీఆర్ అని.. ఆయన ఫుల్ బాటిల్‌కు బ్రాండ్ అంబాసిడరని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్ల పాటు కేసీఆర్ జనాన్ని మత్తులో ముంచెత్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోన్న సందర్భంగా ప్రభుత్వం-ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో ప్రజా పాలన విజయోత్సవ తొలిసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మాట ఇచ్చి.. పదేళ్లలో రుణమాఫీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆరు నెలల్లోనే రుణమాఫీకి రూ.18వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఒక్కసారి ఓడిస్తే.. మళ్లీ ప్రజల మొహం చూడరా? అధికారం ఇస్తే దోచుకోవడం.. ఓడిస్తే ఫామ్‌హౌస్‌లో కూర్చోవడమేనా మీ పని అని ప్రశ్నించారు. ప్రజల మీద ప్రేమ ఉంటే ఎందుకు ప్రజల మధ్యకు రావడం లేదని నిలదీశారు. నిజంగా ప్రజలు కష్టాల్లో ఉంటే వాళ్ల మధ్యకు వచ్చి ఎందుకు అడగటం లేదన్నారు. రాహుల్ గాంధీని చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. మూడుసార్లు అధికారం దక్కకపోయినా.. రాహుల్ గాంధీ ప్రజల మధ్యే ఉన్నారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యతను ఎందుకు నిర్వర్తించడం లేదని నిలదీశారు.రాష్ట్ర ఆదాయం నెలకు రూ.18500 కోట్లలో రూ.6500 కోట్లు జీతాలు రూపంలో.. మరో రూ.6000 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ రూపంలో పోతున్నాయని తెలిపారు. దీనిపై అసెంబ్లీలో చర్చ పెడదాం రావాలని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నువ్వు అసెంబ్లీకి రావు.. ఇద్దరు

చిల్లరగాళ్ళను వదిలావని కేటీఆర్, హరీష్ రావుపై ఘాటు విమర్శలు చేశారు. అభివృద్ధిని అడ్డుకోవాలని ఎవరైనా కుట్రలు కుతంత్రాలు చేస్తే జైల్లో పెట్టి ఊచలు లెక్క పెట్టిస్తామని హెచ్చరించారు. 11 నెలల్లోనే ప్రజలు ఏం కోల్పోయారో వాళ్లకు



తెలిసొచ్చిదన్న కేసీఆర్ వ్యాఖ్యలకు సైతం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ మీరు ఫామ్ హౌజ్‌లోనే ఉండండి.. ప్రజలు ఏం కోల్పోలే.. మీ ఇంట్లో నలుగురి పదవులు మాత్రం పోయాయని రివర్స్ కౌంటర్ ఇచ్చారు. దీంతో 50వేలమందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారం దిగిపోతే కేసీఆర్, కుటుంబ సభ్యుల ఉద్యోగాల ఊడాయి తప్ప.. రాష్ట్రానికి ఏం కాలేదు. కేసీఆర్.. హాయిగా మీరు ఫామ్ హౌస్‌లో పడుకోండి. అవసరమైతే అక్కడే వైన్ షాప్ ఏర్పాటు చేయిస్తా. మీ ఉద్యోగాలు పోయాయి కాబట్టి రైతులకు రుణమాఫీ జరుగుతోంది. ఇంకా కొంతమందికి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగలేదు. కచ్చితంగా చేసి తీరుతాం. అభివృద్ధిపై చర్చకు బిర్లా-రంగాలు సిద్ధమా..? రైతు రుణమాఫీ చేస్తే అభినందించాల్సిందిపోయి విమర్శిస్తున్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అనలేదా?. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో అసెంబ్లీకి వచ్చి చెప్పాలి. నువ్వు ఎప్పుడంటే అప్పుడు అసెంబ్లీ పెట్టిస్తా. కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి మాట్లాడాలి. ఆయన రాకుండా ఇద్దరు చిల్లరగాళ్లను పంపుతున్నారని మండిపడ్డారు. వరంగల్‌ను అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను వృద్ధిలోకి తీసుకొచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా వరంగల్ ను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జ్ మంత్రి పట్టుబట్టి అభివృద్ధి పనులను సాధించుకున్నారని చెప్పారు. విమానాశ్రయంతో వరంగల్ రూపురేఖలు మారనున్నాయన్నారు. చాలా రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఒకేఒక ఎయిర్‌పోర్టు ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకున్నారని.. తమను దీవించి పదవులిచ్చిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చేందుకు ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వంలో కొన్నేళ్లపాటు మహిళా మంత్రి కూడా లేరని గుర్తు చేశారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లపాటు మనసొప్పలేదని, ఎంతో పట్టుదలతో కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు. వరంగల్ గడ్డ నుంచి రైతులందరికీ మరోసారి మాట ఇస్తున్నా. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రూ.2లక్షలలోపు రుణమాఫీ వర్తించలేదు. ఇచ్చిన మాట ప్రకారం రుణాలన్నీ మాఫీ చేస్తాం అని సీఎం ప్రకటించారు. తెలంగాణ గడ్డపై సూర్య, చంద్రులు ఉన్నంత వరకూ ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలు, ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే తాను టీపీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్నిక అయ్యానని రేవంత్ రెడ్డి చెప్పారు. మీరు భుజాల మీద మోయబట్టే మేమంతా ఇవాళ వివిధ హోదాల్లో ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే ఆడబిడ్డల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మా ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపై ఉంది. 2014 నుంచి 2019 వరకూ బీఆర్ఎస్ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రిగా లేరని ఆయన చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ మహిళలు ఇచ్చిన తీర్పుతో మొదటి మంత్రివర్గంలోనే కొండా సురేఖ, సీతక్కకు మంత్రులుగా అవకాశం కల్పించామని సీఎం చెప్పుకొచ్చారు. ఈ ఓరుగల్లు ఆడబిడ్డలకే మంత్రివర్గంలో ప్రముఖస్థానం ఇచ్చి నేటి సభా నిర్వహణ కార్యక్రమాన్ని సైతం వారి చేతుల్లోనే పెట్టామని రేవంత్ తెలిపారు. ఇదే కాకుండా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కడియం కావ్యను పార్లమెంట్‌కు పంపించామని ఆయన చెప్పారు. ఆమె తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతోందని అన్నారు. పాలకుర్తిలో ఓ రాక్షసుడు రాజ్యమేలుతుంటే యశస్విని రెడ్డి అనే సోదరి ఆ

రాక్షసుడిని ఎన్నికల్లో ఓడించి పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేసిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ కూడా ఆడబిడ్డనే అని ఆయన తెలిపారు. అనేక మంది మహిళా అధికారులు పలు జిల్లాలకు కలెక్టర్లుగా ఉన్నారని వెల్లడించారు. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌గా కూడా ఓ మహిళలే ఉందని సీఎం చెప్పుకొచ్చారు.

వారి రుణం ఇంకా తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణను అవమానించిన, వ్యతిరేకించిన ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఊడిగం చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలను కిషన్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో సబర్మతి సుందరీకరణను సమర్థించి.. మూసీ సుందరీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క,కోమటిరెడ్డి,శ్రీధర్ బాబు, పొంగులేటి,జూపల్లి, పొన్నంప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ఎంపి కడియం కావ్య, కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో నేడే పోలింగ్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒక 'మినీ' సంగ్రామాన్ని తలపించింది. ఆరు ప్రధాన పార్టీలు, ఆ పార్టీలకు చెందిన రాష్ట్ర, కేంద్ర అగ్రనేతల హోరాహోరీ ప్రచారంతో ఇక్కడ తీవ్ర ఉత్కంఠనెలకొంది. 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 20న బుధవారం పోలింగ్ జరగనుంది. అధికార మహాయుతి కూటమి, విపక్ష మహా వికాస్ అఘాడి మధ్య పోటీ నువ్వా-నేనా అన్న రీతిలో ఉండనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకోబోతున్నారు. ఎన్‌డిఎ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రధాని మోడీ ధీమాగా ఉన్నారు. ఈ క్రమంలో పోలింగ్ కోసం ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది. ఉద్యోగులు తమ సామాగ్రిని తీసుకుని ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన



పోలింగ్ కేంద్రాకు చేరుకున్నారు. ప్రధానంగా 5 నియోజకవర్గాల పైనే అందరి దృష్టి నెలకొంది. ఇక్కడ పోటీ మహా సంగ్రామాన్నే తలపించనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వర్లి నియోజకవర్గంలో త్రిముఖ

పోటీ నెలకొంది. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన అభ్యర్థిగా మిలంద్ దేవర పోటీ చేస్తుండగా, ఉద్ధవ్ థాకరే శివసేన తరఫున ఆయన కుమారుడు ఆదిత్య థాకరే బరిలో ఉన్నారు. మహారాష్ట్ర నవనిర్మాణ సేన నేత సందీప్ దేశ్‌పాండే సైతం తన అదృష్టం పరీక్షించుకుంటున్నాడు. సౌత్ ముంబై మాజీ ఎంపీ అయిన మిలంద్ దేవర అర్బన్ మిడిల్ క్లాస్ ఓటర్లపైనే ప్రధానంగా దృష్టి సారించారు. యూపీఏ-2 ప్రభుత్వంలో ఆయన సమాచార, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. ఇక ఆదిత్య థాకరే 2019లో ఎన్నికల్లోకి అడుగుపెట్టి వర్లి నియోజకవర్గం నుంచి 89,248 ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. కోవిడ్-19 సమయంలోనూ ఆదిత్య అందించిన సేవలకు మంచిపేరు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ పాజిటివ్ పేషెంట్ల అడ్మిషన్ వ్యవహారాలను స్వయంగా ఆయన పర్యవేక్షిస్తూ వచ్చాయి. వర్లిలో మహా నవనిర్మాణ సేనకు పెద్దగా ఓటర్ల బలం లేకున్నప్పటికీ స్థానిక సమస్యలను పరిష్కరించడంలో సందీప్ దేశ్‌పాండేకు మంచి పేరుంది. ముఖ్యంగా మరాఠీ మాట్లాడే ఓటర్లలో ఆయనకు గుర్తింపు ఉంది.

# నింగిలోకి దూసుకుపోయిన జీశాట్-20

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో రూపొందించిన అత్యంత అధునాతన సమాచార శాటిలైట్ జీశాట్-20 నింగిలోకి దూసుకుపోయింది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఈ జీశాట్-20ను నింగిలోకి మోసుకుపోయింది. అమెరికాలోని ఫ్లోరిడా కేప్ కెనావెరల్ వేదికగా ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. సుమారు 34 నిమిషాల పాటు ప్రయాణించిన తర్వాత ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశ పెట్టారు. కాగా, 4700 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని మన రాకెట్‌లు తీసుకెళ్లేందుకు సాధ్యపడలేదు.. దీంతో స్పేస్ ఎక్స్ ద్వారా ఇస్రో ప్రయోగించింది. జీశాట్-20 శాటిలైట్ 14 ఏళ్ల పాటు సేవలు అందించనుంది. వాణిజ్య పరంగా ఇస్రో, స్పేస్‌ఎక్స్ మధ్య ఇదే తొలి ప్రయోగం అని చెప్పాలి. భారత్‌లోని మారుమూల ప్రాంతాలు, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ లాంటి ద్వీపాల్లోనూ ఇంటర్నెట్ సేవలను అందించడమే ఈ ఉపగ్రహం యొక్క ప్రధాన లక్ష్యం. అంతేకాకుండా అడ్వాన్స్‌డ్ బ్యాండ్ ఫ్రీక్వెన్సీ లక్ష్యంగా ఇస్రో దీన్ని తయారు చేసింది. జీశాట్-ఎన్2 శాటిలైట్ ద్వారా విమానాల్లో వై-ఫై సేవలు మరింత విస్తృతం కాబోతున్నాయి.

# రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు..

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. రెండురోజులుగా ఉష్ణోగ్రతలో మార్పులు చోటు చేసుకున్నాయి. రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. రాబోయే కొద్దివారాలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ తాజా హెచ్చరిక డిసెంబర్-జనవరి నాటికి తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని జిల్లాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారుల మాట. ఏపీలోని ఉమ్మడి విశాఖ జిల్లా విషయానికొస్తే.. మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పడిపోతున్నాయి. ప్రస్తుతం 11 మండలాలను చలి వణికిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పాడేరు, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కి పడిపోయాయి. అరకులో 8. 9 డిగ్రీలు, దుంబ్రిగూడ లో 9.7, మాడుగులలో 10 డిగ్రీలు, ముంచంగిపుట్టు, హుకుంపేటలో 10.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు సూర్యుడు కనిపించలేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి మొదలవుతోంది. మన్యం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్యగా మారింది. సెల్ సిగ్నల్స్ రాక ఇబ్బందులు పడుతున్నారు పర్యాటకులు. రాత్రివేళ తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు చలి మంటలు వేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే రోడ్లపై పొగమంచు కమ్మేస్తోంది. చాలా చోట్ల పగటి వేళ వాహనదారులు లైట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ విషయానికొస్తే.. రెండురోజులుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. పటాన్‌చెరులో 12.4 డిగ్రీలకు పడిపోయింది. తెలంగాణ అంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాజన్న సిరిసిల్లలోని వీర్నపల్లిలో రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత 13.9 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 12.0 డిగ్రీలుగా ఉంది. రాబోయే కొన్ని వారాల పాటు చలిగాలులు కొనసాగుతాయని ఐఎండీ అంచనా వేసింది. కొమురం భీం జిల్లా సిర్పూర్ లో 10.5 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా పొచ్చెరలో 11.8 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నిర్మల్ జిల్లా కుంటాలలో 12.6 డిగ్రీలు కాగా.. ఇక మంచిర్యాల జిల్లా ర్యాలీ లో 13.1 గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయింది. మిగతా జిల్లాల్లోనూ చలిగాలులు వీస్తున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు రోజులుగా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో చలి గాలుల తీవ్రత పెరిగింది.రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంలో 12.2 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాబాద్‌లో 12.6 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో 13.8 డిగ్రీలు, కుత్బుల్లాపూర్, సమీర్‌పేటలో 14.4 డిగ్రీలు, అత్యల్పంగా 12.2 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 12.2, వికార్‌బాద్‌లో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యల్పంగా నమోదైంది. ఇక రాజధాని నగరం హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత పెరుగుతోంది. శివారు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో మార్నింగ్ వాకింగ్ చేసే వారి సంఖ్య తగ్గుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఇక ఏపీలోనూ చలి తీవ్రత పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ముంచింగిపుట్టులో 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరులో 12 డిగ్రీలు, మినుములూరులో 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటిపూట ఎండ ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పెరుగుతున్న చలి దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేనే రాత్రి, తెల్లవారుజామున బయటకు వెళ్లాలని చెబుతున్నారు.

శీతాకాలం తీవ్రతరం అయ్యే కొద్దీ ఉష్ణోగ్రతలో మరింత పడిపోవచ్చని చెబుతోంది. ముమ్మందు విపరీతమైన చలిని ఎదుర్కొనేందుకు నగరవాసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

# ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారు

**హైదరాబాద్:** కాంగ్రెస్ సంబరాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మల్కాజ్‌గిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. ఏం ఘనత సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మెజార్టీ ప్రజలు చెబుతున్నారంటూ విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అబద్ధాల పునాదుల మీద రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. హామీల చర్చపై రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా. నీ హామీల అమలుపై చర్చకు మోడీ ఎందుకు? ఇక్కడ మేము ఉన్నాం. ఎక్కడ చర్చకు రావాలో రేవంత్ చెప్పాలి. మేము సిద్ధంగా ఉన్నాం. నీ ఆరు గ్యారంటీలే కాదు 420 హామీలపై చర్చిద్దామని ఈటల రాజేందర్ అన్నారు. గత ప్రభుత్వం ముచ్చర్లలో ఫార్మాసిటీకోసం 19వేల ఎకరాలు భూ సేకరణ చేసేందుకు ప్రయత్నించింది. ఫార్మాసిటీలను రద్దు చేస్తాని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఫోర్త్ సిటీకోసం 30వేల ఎకరాలు అంటున్నారు. ఫోర్త్ సిటీ కోసం రైతుల పొట్ట కొడుతున్నారు. ఫార్మా సిటీ రద్దు అన్నారు.. కొడంగల్‌లో ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. లగచర్లలో మా మీద దాడి జరగలేదని కలెక్టరే చెబుతున్నారు. అయినా, రైతులను నానా హింసలకు గురి చేస్తున్నారు. ఎనిమిది నెలలుగా నిరసన తెలుపుతున్న వారిని గుర్తించి పోలీసులు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. లగచర్ల రైతులు నక్సలైట్లా వాళ్లేమైనా సంఘ విద్రోహ శక్తులా అంటూ ప్రశ్నలు కురిపించారు. నర్మదా, సబర్మతి నదుల్లాగే మూసీ అభివృద్ధి జరగాలి.. అందుకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. మూసీ ఇరువైపులా ఇళ్లను కూల్చి భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ముచ్చర్లలో గత ప్రభుత్వం 14 వేల ఎకరాలు భూసేకరణ చేశారు. ఆ భూములు పోగొట్టుకున్న రైతులు కూలీలుగా మారారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో లో ఫార్మా సిటీ రద్దు చేసి.. రైతులకు తిరిగి భూమి ఇస్తామని చెప్పారు. ఫోర్త్ సిటీ పేరుతో 14 వేల ఎకరాలకు తోడుగా మరో 16 వేలు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. రియల్ ఎస్టేట్ పేరుతో రైతుల భూములు లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొడంగల్ లో రైతులు భూమి ఇవ్వలేమని కాళ్ళు మొక్కినా బెదిరించి సెకరించే ప్రయత్నం చేస్తున్నారు. స్వయంగా కలెక్టర్ నాపై దాడి జరగలేదని చెప్పారు. లగచర్ల చుట్టూ పక్కల గ్రామాలకు మాత్రమే సమస్య కాదు.. ప్రతీ రైతు రేపటి రోజున మాకు సమస్య వస్తుందని భయపడుతున్నారు. రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రైతులు నక్సలైట్లు కాదు.. వేరే వాళ్ళ భూములు అడగడం లేదు.. రేవంత్ రెడ్డిది మా కొడంగల్ కాకపోయినా గెలిపిస్తే మమల్ని హింసిస్తున్నారని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం.. కానీ రేవంత్ లా ప్రజలను ఇంతగా ఎవరు హింసించలేదు. మూసీ పక్కన ఉన్న భూములను లాక్కొని.. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు. ఒక వైపు హైడ్రా కూల్చివేతలు.. మరోవైపు లగచర్ల లాంటి ఘటనలు జరుగుతుండగా ఇంకోవైపు ప్రభుత్వం సంబరాలు చేసుకుంటున్నారని ఈటెల విమర్శలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇచ్చిన హామీలు నెరుపుతున్నాయా అనేది ముఖ్యమంత్రే చెప్పాలి. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎంకు ఉందా రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. మీ మేనిఫెస్టో ఏమయ్యింది. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.

వేగుచుక్క

# తెలంగాణ అభివృద్ధి వైపు పయనం.







**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 19:**

తెలంగాణ అభివృద్ధి వైపు పయనిస్తుందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు 2024 సందర్భంగా మంగళవారం స్థానిక కళాభారతి లో రాష్ట్ర స్థాయి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. మహిళాశక్తీ కార్యక్రమం క్రింద మైక్రో ఎంటర్ ప్రైసెస్, పాడి పరిశ్రమ, క్యాంటీన్ లో నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో 423 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల సంక్షేమం కోసం పండించిన వరి ధాన్యం ను కొనుగోలు చేస్తున్నదని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500/- బోనస్ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. కళాకారులు ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా అంతడుపుల నాగరాజు బృందం చే కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 రూ.లకే వంటగ్యాస్ సిలిండర్, రెండు లక్షల



**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**ఘనంగా ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు 2024.**

**అలరించిన అంతడుపుల నాగరాజు కళా బృందం సాంస్కృతిక కార్యక్రమాలు.**

రుణ మాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తున్నదని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నాదని తెలిపారు. అనంతరం అంతడుపుల నాగరాజు కళా బృందాలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ పోరాట యోధులు, పోతారాజులు, బతుకమ్మ వంటి వాటిపై నృత్య ప్రదర్శనలు, ప్రజా ప్రభుత్వం పిలిచింది, ప్రజా పాలన వచ్చింది అనే అంశాలపై నాటికలను సుమారు 75 మంది కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ రంగనాథ్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళలు, పాఠశాల విద్యార్థినులు , తదితరులు పాల్గొన్నారు.


# కేటీఆర్ అరెస్ట్ పై యూ టర్నేనా?



హైదరాబాద్:దీపావళి బాంబులు అన్నారు. ఏ టైమ్‌లో ఏదైనా జరగొచ్చు అన్నారు. కేటీఆర్ అరెస్ట్ ఖాయమన్నారు. ఓ నాలుగు రోజుల హడావుడితో..తెలంగాణ పొలిటికల్ మూడ్‌నే మార్చేశారు కాంగ్రెస్ నేతలు. సీన్ కట్ చేస్తేకేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే సిచ్యువేషన్ ఎలా ఉంటుందని లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వాన్ని నిత్యం ఏదో ఒక ఇష్యూతో ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్న..కేటీఆర్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపాలనికాంగ్రెస్‌లో ఒక వర్గం నేతలు బలంగా డిసైడ్ అయ్యారట. గత సర్కార్ హయాంలో కేటీఆర్ నిర్వహించిన మంత్రిత్వ శాఖల్లో అక్రమాలపై ఆయనను అరెస్ట్ చేస్తే అంతా సైలెంట్ అయిపోతారని భావించారట. కానీ ఇప్పుడుకాంగ్రెస్ నేతలే డైలమాలో పడ్డారట.బీఆర్ఎస్ ప్రభుత్వ స్కీముల్లో స్కామ్‌లు జరిగాయని అప్పట్లో కాంగ్రెస్ పెద్ద ఎత్తున విమర్శలు చేసింది. కానీ ప్రభుత్వంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇప్పటివరకు ఏ విషయంలోకేసీఆర్ ఫ్యామిలీని ఫిక్స్ చేయలేకపోయామని కాంగ్రెస్ అంతర్గత సమావేశాల్లో చర్చ జరిగిందట. ఏదో ఒకదాంట్లో కార్నర్ చేసి జైలుకు పంపాల్సిందేనని పార్టీలో కొందరు నేతలు పట్టుబడుతున్నారట.ఫార్ములా ఈ రేస్ నిధుల విడుదల నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. కేటీఆర్ అడ్డంగా బుక్కయ్యారని అరెస్ట్ చేయాలని పార్టీ నేతల నుంచి డిమాండ్ వచ్చింది. ఇదే విషయంలో కొందరు కాంగ్రెస్ నేతలు లీకులు కూడా ఇచ్చారు.కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం కోసం గవర్నర్ అనుమతి కోరుతూ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ విషయం ఎటూ తేలకముందే మరో అంశం తెరపైకి వచ్చింది. అదే లగచర్ల ఘటన.సీఎం రేవంత్ రెడ్డి సొంత కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీ కోసం భూసేకరణపై లగచర్ల పెద్దదుమారం లేచింది. లగచర్లలో కలెక్టర్‌తో పాటు అధికారులపై రైతులు తిరగబడ్డారు. ఇదంతా జరగడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమనికాంగ్రెస్ ఆరోపిస్తోంది .దాడికి సూత్రధారిగా భావిస్తున్న సురేష్ అనే వ్యక్తి.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి పలుమార్లు కాల్స్ చేశారని..స్వయంగా కేటీఆర్‌తో మాట్లాడారని..ఆ తర్వాతే దాడి జరిగిందని అంటోందికాంగ్రెస్. ఆరోపణలకు బలం చేకూరేలా పోలీసుల రిమాండ్ రిపోర్ట్‌లో కేటీఆర్ పేరు ప్రస్తావించడం పొలిటికల్‌గా మరింత హీట్ పెంచుతోంది. ఈ విషయంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలనే డిమాండ్ కూడా కాంగ్రెస్‌లో బలంగా వినిపించింది. కొందరు నేతలు కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలంటూ ఓపెన్‌గానే కామెంట్స్ చేశారు.లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే జరిగే పరిణామాలపై కాంగ్రెస్ లోతుగా ఆలోచన చేసిందట. లగచర్ల అంశం రైతులతోముడిపడి ఉండటం..అరెస్ట్ అయినవారంతా ఎస్టీ లంబడా సామాజికవర్గానికి చెందినవారు కావడంతో కాంగ్రెస్ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో కేటీఆర్‌ను కార్నర్ చేసి అరెస్ట్ చేస్తే రాజకీయంగా కాంగ్రెస్‌కు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని భావిస్తోందట. రైతులు.. అందులోనూ లంబాడ సామాజికవర్గంలో కేటీఆర్‌కు, బీఆర్ఎస్‌కు సానుభూతి పెరిగే ఛాన్స్ ఉందని ఆలోచనలో పడ్డారట. అందుకే లగచర్ల ఘటనలో కేటీఆర్ అరెస్ట్‌పై హస్తం పార్టీ సైలెంట్ అయినట్లు టాక్ వినిపిస్తోంది.ఏదో ఒక ఇష్యూలో కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేతలు బలంగా ఫిక్స్ అయిపోయారట. లగచర్ల ఘటన..రైతులు, ఎస్టీలతో ముడిపడి ఉండటంతో కాస్త వెనక్కి తగ్గినా కేటీఆర్‌ను జైలుకు పంపడం మాత్రం ఖాయమంటున్నారు కాంగ్రెస్ నేతలు.

ఫార్ములా ఈ రేస్ కేసులో గవర్నర్ అనుమతి రాగానే..కేటీఆర్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తారట.అయితే ఫార్ములా ఈ రేస్ అయినా..లగచర్ల ఘటనా అయినా అరెస్ట్ చేస్తే చేసుకోండి..తగ్గేదేలే అంటున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇలా కేటీఆర్ అరెస్ట్ ఇష్యూ హాట్ టాపిక్‌గా ఉండి చల్లబడిపోతుందా..లేక అరెస్ట్ వరకు వ్యవహారం వెళ్తుందా అనేది మాత్రం సస్పెన్స్‌గానే మారింది.

# ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం పొడిగింపు ?



**న్యూ ఢిల్లీ :**భారతీయ రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలాన్ని కేంద్ర మరోసారి పొడిగించే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలిసింది. ఆయన ప్రస్తుత పదవీ కాలం వచ్చే నెల డిసెంబర్ 10తో ముగియనుంది. ఈ స్థానం కోసం ఇతర అభ్యర్థులను ఎవరినీ ఇప్పటి వరకూ ఎంపిక చేయలేదని తెలిసింది. దీంతో ఆయన పదవీకాలం రెండోసారి పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. మహారాష్ట్ర ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత పొడిగింపును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.కాగా, 1980వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్.. 2018 డిసెంబర్ 12న ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కేంద్రం శక్తికాంత దాస్‌ను నియమించింది. అప్పటి నుంచి అదే పదవిలో కొనసాగుతున్నారు. 2021 డిసెంబర్ 10కి ఆయన మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో.. కేంద్రం మరోసారి ఆయనకే పట్టం కట్టింది. శక్తికాంత దాస్ పట్ల కేంద్ర ప్రభుత్వం విశ్వాసం ప్రకటించింది. మరో మూడేండ్ల పాటు ఆయన ఆ పదవీకాలం పొడిగించారు. ఈ ప్రకారం వచ్చే నెల డిసెంబర్‌తో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. అయితే, మరోసారి ఆయన్ని ఆర్బీఐ గవర్నర్‌గా కొనసాగించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఐదేళ్ల కంటే ఎక్కువకాలం ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ ఉన్నారు. మరోసారి ఆయన పదవీకాలం పొడిగిస్తే.. బెనగల్ రామారావు తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా చేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు. రామారావు 1949-1957 మధ్య ఏడున్నర సంవత్సరాల పాటు ఆర్బీఐ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఆయనే అత్యధిక కాలం ఆ పదవిలో ఉన్నారు. ఇప్పుడు ఆయన తర్వాత అత్యధిక కాలం ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన వ్యక్తిగా దాస్ నిలవనున్నారు. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.1980వ బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శక్తికాంత దాస్.. 2017 వరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శిగా పని చేశారు. 2016లో నోట్ల రద్దు టైంలో కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆర్థికశాఖలో పని చేస్తున్నప్పుడు 8 బడ్జెట్ల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు. ఆర్థికం, పన్నులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 38 ఏండ్ల కెరీర్‌లో శక్తికాంత దాస్ వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

# ఇక అధికారులపై చర్యలు... రంగనాథ్

హైదరాబాద్: ప్రభుత్వ భూముల్లో, చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలను హైడ్రా కొన్ని నెలల నుంచి కూల్చివేయడం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రా వ్యవస్థను తీసుకురాగా, ఐపీఎస్ ఏవీ రంగనాథ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేయడం మాత్రమే కాదు, అధికారులు తప్పు చేశారని తేలితే వారిపై సైతం చర్యలు తీసుకుంటామని రంగనాథ్ స్పష్టం చేశారు. సంగారెడ్డి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం పర్యటించారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు, శంభునికుంట, వెంకరమణ కాలనీ, హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మరావు నగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడి ప్రజలతో కాసేపు మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు ఎక్కడ ఉన్నా, ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకుంటుందన్నారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ ప్రజలు స్థానికంగా ఆక్రమణలు, అక్రమ లే అవుట్లపై రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. అమీన్ పూర్ చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై వరుస ఫిర్యాదులు రావడంతో నేరుగా ఆయన పరిశీలనకు వెళ్లారు. ఇటీవల అమీన్ పూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపి, కూల్చివేతలు చేపట్టింది.అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి, స్థానికులను కలిసిన అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. చాలా రోజుల నుంచి అమీన్‌పూర్ పెద్ద చెరువు ప్రాంతంలో కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అలుగులు, తూములు ఏదో కారణంతో మూసేయడంతో ఎఫ్‌డీఎల్ పెరిగిందని స్థానికులు తనకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. త్వరలోనే దీనిపై టెక్నికల్ టీమ్‌తో అమీన్ పూర్ చెరువు భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పై సర్వే చేయిస్తాం అన్నారు. వచ్చే సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేసి, మూడు నెలల్లో ఇక్కడికి మళ్లీ వస్తానని. పద్మావతి లేఅవుట్ పై ఫిర్యాదులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమణలకు పాల్పడ్డారని తమ దృష్టికి వచ్చిందన్నారు. హైడ్రాకు అధికారం ఉన్నందున వీటిపై విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, పార్కులు, చెరువులు కబ్జాకు గురైనట్లు చాలా ప్రాంతాల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయని రంగనాథ్ తెలిపారు.




వేగుచుక్క

# సకాలంలో రైతులకు బిల్లుల చెల్లింపులు జరగాలి.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 19 :**

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ జరిగిన వెంటనే ఆన్లైన్ లో ఓపీఎంఎస్ వివరాలను నమోదు చేసేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. మాక్లూర్ మండలం ఒడ్డాట్ పల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం ఎంత, రైస్ మిల్లులకు ఎంత పరిమాణంలో ధాన్యం రవాణా చేశారు,



బిల్లుల చెల్లింపులు ఏ మేరకు జరిగాయి తదితర వివరాలను నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించిన అనంతరం రైస్ మిల్లుల వద్ద ఎక్కడైనా తరుగు, కడ్తా పేరిట కోతలు అమలు చేస్తున్నారా అని రైతులను ఆరా తీశారు. ఇప్పటివరకు అలాంటిదేమీ లేదని, కొనుగోలు కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని రైతులు తెలిపారు. ఏఈఓ ధ్రువీకరణ పత్రాన్ని జతపరుస్తూ, ఆన్లైన్ లో సన్న ధాన్యం వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే సింహభాగం ధాన్యం సేకరణ జరిగినందున, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# నేడు ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ కార్యక్రమం.

## - ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 19**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన యేడాది పూర్తైన సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ సంబరాలలో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 6.00 గంటలకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే అట్టహాసంగా ప్రజా కళా యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంను సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆయా శాఖల వారీగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర స్థాయి కళాకారుల బృందం హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైన అంతడుపుల నాగరాజు బృందం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. వేదికను అందంగా, ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేయాలని, అతిథులు, ఆహుతుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కళాయాత్ర కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేస్తూ విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఆర్ఓ పద్మశ్రీ, తహసీల్దార్ బాలరాజు తదితరులు ఉన్నారు.

# నేత్రాల పరిరక్షణ జీవితంలో ప్రధానం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల.

## డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 19**



నేత్రాల పరిరక్షణ జీవితంలో ఎంతో ప్రధానం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.
నిజామాబాద్ బార్ అసోసియేషన్ సౌజన్యంతో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిర్వహించిన కంటి వైద్యశిబిరంను జిల్లాకోర్టు ప్రాంగణంలో మంగళవారం జిల్లా జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానవ శరీరంలో కళ్ళు ప్రధాన అవయవాలని, కంటి చూపుతో విశ్వాన్ని దర్శించవచ్చని అన్నారు. మనిషి మరణాంతరం నేత్రాలను మరో మనిషికి దానం చేసే గొప్ప అవయంగా వైద్య పరిభాషలో పేర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. నేత్రధానం వలన మరికొందరు ప్రపంచాన్ని చూడగలుగుతున్నారని ఆమె అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సామాజిక దృక్పథంతో వైద్యారోగ్య శిబిరం నిర్వహించడాన్ని జిల్లాజడ్జి ప్రశంసించారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పని ఒత్తిడికి లోనవుతారని, దాని వలన కళ్లపైన ప్రభావం పడుతుందని అన్నారు. కంప్యూటర్లు, సెల్ ఫోన్స్, ల్యాప్ ట్యాప్, ట్యాబ్ ల వినియోగం వలన నేత్రాలు రకరకాల అనారోగ్య సమస్యలపాలు అవుతున్నాయని అన్నారు. దీనిని అధిగమించడానికి కంటి వైద్యపరీక్షలు చేసుకోవాలని అన్నారు. డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి డాక్టర్ శరత్ జోషి, ఆస్పత్రి అప్తమలిస్ట్ విభవ్, చరణ్ గౌడ్, గణేష్, సంజయ్ లు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్ గవర్నమెంట్ ప్లీడర్ వెంకట రమణగౌడ్ , న్యాయవాదులు ఎం. లక్ష్మణ్, కవిత రెడ్డి, అంజలి, రజిత, అరెటి నారాయణ, రాణదేశ్, మానిక్ రాజు, విగ్నేష్, చింతకుంట సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సిఐటీయూ నాయకుడు బిఎల్టీయూ లో చేరిక.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 19:**



సిరిసిల్ల జిల్లాకు చెందిన సిఐటీయూ బీడి కార్మిక విభాగం నాయకుడు అజయ్ బిఎల్ టీయూ సంఘంలో చేరారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని బిఎల్ టీయూ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్ సిద్ధిరాములు సమక్షంలో సంఘంలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాలో కార్మిక సమస్యలపై అజయ్ గత 15 ఏళ్లుగా పోరాడుతున్నాడని అన్నారు. తమ సంఘం ద్వారా భవిష్యత్తులో ఉద్యమిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ రాష్ట్ర నాయకులు, ముద్రకొల ఆంజనేయులు, నాగారపు యెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సీఎంఆర్ఎఫ్ 50 శాతం ఇవ్వాలి.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 19:**

## అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్.

## 84 మంది లబ్దిదారులకు రూ. 25,65,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత.

## అప్లై చేసుకున్న 3 నెలలోపు చెక్కులు వచ్చే విదంగా కృషి.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ అప్లై చేసుకున్న మొత్తంలో 50శాతం ప్రభుత్వం ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 84 మందికి 25,65,000 రూపాయల విలువ గల చెక్కులు అందించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎక్కువ మొత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అర్బన్ నియోజకవర్గనికి రావడం జరిగిందని అన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సెక్రటరేట్ కి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అప్లై చేసుకున్న మొత్తంలో 15%, 20% మాత్రమే చెల్లిస్తుందని లక్షల్లో ఖర్చు ఉంటే 15వేలు, 20వేలు ఇస్తే సామాన్యులకు చికిత్స ఖర్చు ఆర్థిక భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సీఎంఆర్ఎఫ్ అప్లై చేసుకున్న మొత్తంలో 50% ప్రభుత్వం చెల్లించేలే డిమాండ్ చేస్తానని తెలియజేశారు.
గత ఎమ్మెల్యే హయాంలో సంవత్సరాలు గడిసినా చెక్కులు రాలేదని, ఇప్పుడు అప్లై చేసుకున్న 3 నెలలో చెక్కులు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు అందరు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ భర్త పై దాడిని ఖండించిన అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 19:**



నగర మేయర్ భర్త దండు శేఖర్ పై జరిగిన దాడిని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ ఖండించారు. తీవ్ర గాయాలపాలై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న శేఖర్ ను ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శేఖర్ పైన జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు, నిందితుడు ఏ పార్టీ వారైనా, వారి వెనుక ఎవరు ఉన్న కఠినంగా శిక్షించాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా చట్టాన్ని చేతిలోకి తీసుకొని వ్యక్తిగతంగా దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. తప్పు చేస్తే పోలీస్ వ్యవస్థలు, న్యాయస్థానాలు ఉన్నాయని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లాఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ ప్రవళిక, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి.

## - పాలిటెక్నిక్ విద్యార్థులతో పిడిఎస్ యూ ర్యాలీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 19:**



జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలో మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులతో పి.డి.ఎస్.యూ ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ, గత కొన్ని ఏండ్లుగా నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ ఉన్న, పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారు గాని, అధికారంలో వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని అన్నారు. ఇంజనీరింగ్ విద్య కోసం విద్యార్థులు హైదరాబాదు వెళ్లి చదువుకోవలసి వస్తుందని, లక్షల రూపాయలు అదనపు భారం విద్యార్థుల పైన భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దూరం ఉండటం వలన పేద విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరం అవుతున్నారని,
నిజామాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఉండి కూడా ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే నాలుగు జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడుతుందని,
సిఎం రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల తెచ్చుకుంటున్నాడని, జిల్లాలో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు స్పందించి నిజామాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రిన్స్, జిల్లా కోశాధికారి దేవిక, నాయకులు రాహుల్, సాయి కిరణ్, రాజు,మౌనిక, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా.

## - ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు.

**వేగుచుక్క న్యూస్, జుక్కల్, నవంబర్ 19:**



నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఛైర్మన్ మనోజ్ కుమార్, వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని మండలాలకు నిజాంసాగర్ నుంచి సాగునీరు అందేలా చూస్తామన్నారు. దీనికోసం నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య, విండో ఛైర్మన్లు శపథంరెడ్డి, సాయిరెడ్డి, నాగిరెడ్డి, నాయకులు ఏలే మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, జంబి హనుమన్లు, ఇమ్రోస్, గుర్రపు శ్రీనివాస్, రామ్ రెడ్డి, మురళీధర్ గౌడ్ పాల్గొన్నారు.